

## పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలి

**ప్రజానావ, జైనూర్:** సిర్పూర్(యు)లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సర్పంచులు ప్రజల్లో తీసుకెళ్లాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆత్రం శంకర్ కోరారు. శనివారం సర్పంచ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికి అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పేందర్ గణపత్, సేడమకి జానే రావు, లక్ష్మణ్, బాపూజీ, అంబరావు, బీర్ షావ్ ,గణపత్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవనానికి భూమి పూజ



**ప్రజానావ, జైనూర్:** లింగపూర్ మండలం చోరాపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే గ్రామైక్య సంఘ భవన నిర్మాణానికి చోరాపల్లి సర్పంచ్ మార్సుకోలా అనుసూయ జుగాది శనివారం పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరా క్రాంతి పథకం స్వయం సహాయక సంఘాల మహిళలకు సమావేశం నిర్వహించడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, భవన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి



**ప్రజానావ, కాగజ్‌నగర్:** రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం కాగజ్ నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామం బ్రాహ్మణ చేన్లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న మెడికల్ ఆఫీసర్ ద్వారా ఆస్పత్రి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ సేవలను విస్తరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పిరిసింగుల తిరుపతి, కౌన్సిలర్ చిప్పకుర్తి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## 25న పట్టుకున్న ఇసుక వేలం

**ప్రజానావ, జైనూర్:** గతేడాది నవంబర్ నెలలో నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్‌లో తరలిస్తున్న ఇసుకను జైనూర్ మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారని, అధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న ఆ ఇసుకను ఈనెల 25న వేలం నిర్వహించనున్నట్లు జైనూర్ తహశీల్దార్ ఆడ బిర్షవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనాలనే కాంట్రాక్టర్లు, ఆసక్తిగల వారు తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని, ప్రభుత్వ ఆదాయం పెంపు కోసం స్వాధీనం చేసిన వనరులను పారదర్శకంగా వేలం వేస్తున్నామని వివరించారు.

## ఎగువ మానేరుకు నీరు విడుదల



**ప్రజానావ, గంభీరావుపేట:** రైతుల ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎగువ మానేరుకు మల్లన్న సాగర్ నీరు విడుదలయ్యేలా సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. శనివారం గంభీరావుపేటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ మానేరు కింద సాగవుతున్న పంట భూములు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో మల్లన్న సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిను కేకే మహేందర్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీంతో వేల ఎకరాల సాగు భూములకు ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. రైతుల పరిస్థితిని గమనించిన మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మల్లన్న సాగర్ నుంచి ఎగువ మానేరు ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. నీటి విడుదలతో సాగునీటి సమస్య తగ్గి పంటలకు రక్షణ లభిస్తుందని అన్నారు. రైతుల తరఫున కేకే మహేందర్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం రైతు సమస్యలపై త్వరితగతిన స్పందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేంసూర్ మండలం వెంకటాపురం గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ భద్రావతి సమేత భావన ఋషి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు త్వారణం, ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో కళ్యాణ మహోత్సవ ప్రాంగణానికి తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటలకు వేలిం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి ఉత్సవ మూర్తులకు కళ్యాణం జరిపారు. అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపుతో స్వామి వారు పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి బంధువులు, వెంకటాపు రం పద్మశాలి యూత్, తదితరులు పాల్గొన్నారు. - ప్రజానావ, వేంసూర్

# ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగల చోరీ

నీటి సరఫరాకు అంతరాయం

పోలీసులకు ఫిర్యాదు

**ప్రజానావ, తాండూర్:** మండలంలోని నీలాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మాదారం పోచమ్మ ఆలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను చోరీ చేసిన ఘటన శనివారం వెలుగు చూసింది. ఈ ఘటనతో గ్రామంలో మంచినీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో మంచినీటి సరఫరా కోసం ఉదయం పంపు ఆపరేటర్ వెళ్లగా విద్యుత్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ను పరిశీలించారు. అది పగులగొట్టబడి చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే స్థానిక సర్పంచ్ పోలవేణి తిరుపతికి సమాచారం అందించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ జాన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా గ్రామ పంచాయతీకి నీటి సరఫరా జరుగుతుందని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేవరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సర్పంచ్ కోరారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించే వరకు నీటి సరఫరా అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందునా గ్రామ ప్రజలు సహకరించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌ఫామర్ చోరీ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులతో పాటు మాదారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**ప్రజానావ, గంభీరావుపేట:** మండలంలోని లింగన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మాతృభాషపై ప్రేమాభిమానాలు పెంపొందించేందుకు పాఠశాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా తెలుగు భాష ప్రాముఖ్యత, సాహిత్య వైభవం, సంస్కృతి పరిరక్షణలో మాతృభాష పాత్రపై విద్యార్థులకు వివరించారు. తెలుగు పాఠ్యాంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గంగారాం మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతి, సాంప్రదాయాలకు మూలమని, ప్రతి విద్యార్థి తమ మాతృభాషను గౌరవిస్తూ అభివృద్ధి పర్చుకోవాలని సూచించారు. తెలుగు ఉపాధ్యాయులు నరేందర్, కె రాజయ్య భాషా పరిరక్షణలో యువత పాత్ర గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూతురు ఛాలెంజ్.. నాన్న ఛేజింగ్

- 40 ఏళ్ల వయసులో సిక్స్ ప్యాక్
- పోలీసు క్రీడల్లో సిల్వర్ మెడల్
- ఉప్పల్ ట్రాఫిక్ సీఐ గంటా మల్లేశ్ ఘనత

**ప్రజానావ/హైదరాబాద్:** జీవితంలో చాలామంది కలలు కంటారు.. కానీ కన్న కూతురు తన తండ్రిని సిక్స్ ప్యాక్‌లో చూడాలన్న అభిలాషతో విసిరిన ఛాలెంజ్‌ను స్వీకరించి, దాన్ని అధిగమించడం కొందరి వల్లే అవుతంది. అది మరి కొందరిలో స్ఫూర్తి నింపుతుంది. నాలుగు పదుల వయసులో దేహాన్ని ఆరు పలకలుగా మలిచి కూతురిని ఆ తం డ్రి ఆశ్చర్య చకితురాలిని చేశాడు. కేవలం ఎనిమిది నెల ల్లోనే



శరీర సౌష్టవాన్ని సిక్స్ ప్యాక్‌గా మలిచి చూపించాడు. బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతల్లో ఒకడిగా నిలిచి భళా అనిపించాడు. అతనే ఉప్పల్ ట్రాఫిక్ సీఐ గంటా మల్లేశ్ యాదవ్. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన మల్లేశ్ చిన్నప్పటి నుంచే కష్టాన్ని స్నేహితుడిగా చేసుకున్నాడు. మొదట పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించి తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అంతటితో ఆగకుండా పట్టుదలతో ఎస్సై స్థాయికి ఎదిగి, అక్కడి నుండి ఇన్‌స్పెక్టర్ హోదాకు చేరుకోవడం ఆయన శ్రమకు నిదర్శనం. కానీ ఆయన ప్రయాణం అక్కడితో ఆగలేదు. ఉద్యోగ బాధ్యతల మధ్య కూడా తన కూతురి కోరిక మేరకు శరీరాన్ని సవాలు చేస్తూ సిక్స్ ప్యాక్ సాధించాలి అనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. 42 సంవత్సరాల వయసులో చాలామంది ఇంత రిస్కు తీసుకోవడం అవసరమా అని హితవులు చెబుతున్నా తను మాత్రం తన కూతురు విసిరిన చాలెంజ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. తనను తాను మళ్లీ కొత్తగా నిర్మించుకున్నారు. ఈ లక్ష్యసాధనకు నడుం బిగించినప్పుడు మల్లేశ్ 86 కిలోల బరువున్నాడు. సరిగ్గా 8మాసాల్లో కచ్చితమైన ఆహార నియమావళి, క్రమశిక్షణ, కఠోర సాధన చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ 61 కిలోలకు తగ్గిపోయాడు. సాధన, క్రమశిక్షణ, నమ్మకం, లక్ష్యం – ఇవే ఆయన విజయ రహస్యాలు అని చెప్పాడు. ఇటీవల పోలీస్ శాఖలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో వెండి పతకం గెలుచుకున్నారు. ఇది కేవలం ఒక మెడల్ కాదని, నిబద్ధత.. సాధించాలన్న తపనపై ఉన్న గౌరవం అన్నారు. కన్న కూతురి ఆనందం కోసం చేసిన ప్రయత్నం అన్నారు. వయసు ఒక సంఖ్య మాత్రమే అని మల్లేశ్ నిరూపించారు. లక్ష్యం స్పష్టంగా ఉంటే వయసు అడ్డుకాదనే సత్యాన్ని నిరూపించారు. ఆయన ప్రయాణం యువతకు ప్రేరణ, కుటుంబానికి గౌరవం, ఎంతోమందికి మార్గదర్శకం అని ఉన్నతాధికారులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.



